
రెండో విడత

4,538 నామినేషన్లు




- సర్పంచ్ పదవులకు 1,113, వార్డులకు 3,425
- నేడు అభ్యంతరాల స్వీకరణ.. రేపు పరిష్కారానికి చర్యలు
- 6వ తేదీ వరకు ఉపసంహరణకు గడువు

వికారాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రెండో విడత పంచాయతీ ఎన్నికల్లోనూ పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యాయి. రెండో విడతలో వికారాబాద్, ధారూరు, మోమిన్‌పేట్, నవాబ్‌పేట్, బంట్వారం, మర్పల్లి, కోట్‌పల్లి మండలాల పరిధిలోని 175 పంచాయతీలు, 1,520 వార్డులకు ఎన్నికలు జరగుతున్నాయి. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైన తర్వాత మొదటి, రెండు రోజులు కలిపి సర్పంచ్ పదవులకు 574 నామినేషన్లు దాఖలు కాగా, వార్డు పదవులకు 1,260 నామినేషన్లు వచ్చాయి. చివరి రోజు మంగళవారం నామినేషన్లు దాఖలు చేసేందుకు అభ్యర్థులు పోటీ పడ్డారు. చివరి రోజు సర్పంచ్ పదవులకు 539, వార్డు పదవులకు 2,165 నామినేషన్లు దాఖలయ్యాయి. మొత్తం 175 సర్పంచ్ పదవులకు 1,113 నామినేషన్లు రాగా, 1,520 వార్డు పదవులకు 3,425 నామినేషన్లు వచ్చాయి. బుధవారం నామినేషన్ల పరిశీలన చేపట్టి అర్హులైన అభ్యర్థుల జాబితా ప్రకటించారు. నామినేషన్లకు సంబంధించిన అభ్యంతరాలను 4న తేదీ సాయంత్రం 5 గంటల వరకు స్వీకరించి, 5వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు వాటిని పరిష్కరిస్తారు. 6వ తేదీ, మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉప సంహరించుకునేందుకు అవకాశం కల్పించారు. అదే రోజు సాయంత్రం ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల తుది జాబితాతో పాటు వారికి కేటాయించిన గుర్తులను ప్రకటించనున్నారు. 14వ తేదీన ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎన్నికల పోలింగ్ నిర్వహించి అదేరోజు మధ్యాహ్నం రెండు నుంచి ఓట్ల లెక్కించి ఫలితాలను ప్రకటిస్తారు. కాగా, సర్పంచ్ పదవులకు నవాబ్‌పేట మండలంలో అత్యధిక నామినేషన్లు దాఖలయ్యాయి.

రెండో విడత ఎన్నికల నామినేషన్ల వివరాలు

మండలం	పంచాయతీలు	నామినేషన్లు	వార్డులు	నామినేషన్లు
వికారాబాద్	21	176	182	396
ధారూరు	34	189	286	619
మోమిన్‌పేట్	29	164	256	604
నవాబ్‌పేట్	32	191	276	634
బంట్వారం	12	90	106	261
మర్పల్లి	29	183	264	609
కోట్‌పల్లి	18	120	150	302
మొత్తం	175	1113	1,520	3,425





మద్యం షాప్‌లకు ఎన్నికల కిక్కు

పంచాయతీ ఎన్నికలతో వ్యాపారుల్లో జోష్

- ఎక్సైజ్‌శాఖకు ముందే పండగొచ్చింది
- కొత్త దుకాణాదారులకు కలిసొచ్చిన అదృష్టం
- ఇప్పటికే గ్రామాల్లో ప్రారంభమైన మద్యం పంపిణీ
- ఎక్సైజ్ శాఖకూ భారీగా రానున్న ఆదాయం
- లాభాలు మూడింతలు పెరిగే అవకాశం

వికారాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): 2025-27 ఎక్సైజ్ సంవత్సరానికి సంబంధించి నూతన ఎక్సైజ్ పాలసీని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం మద్యం దుకాణాల కోసం దరఖాస్తులు స్వీకరించి లక్కీ డ్రా ద్వారా ఎంపికైన వారికి మద్యం దుకాణాలు కేటాయించిన విషయం తెలిసిందే. పాత మద్యం దుకాణాల లైసెన్సుల గడువు నవంబరు 30వ తేదీతో ముగియగా, కొత్త మద్యం



దుకాణాలను డిసెంబరు ఒకటో తేదీ నుంచి ప్రారంభించారు. జిల్లాలో సోమవారం నుంచి కొత్త దుకాణాలు ప్రారంభం కాగా, 2027, నవంబరు 30వ తేదీ వరకు రెండేళ్ల పాటు వీటిని నిర్వహించనున్నారు. వికారాబాద్ జిల్లాలో 59 మద్యం దుకాణాలకు లైసెన్సులు జారీ చేయగా, వికారాబాద్ సర్కిల్ పరిధిలో 15, పరిగి పరిధిలో 12, తాండూరు పరిధిలో 18, మోమిన్‌పేట్ పరిధిలో 6, కొడంగల్ సర్కిల్ పరిధిలో 8 మద్యం దుకాణాలు ఏర్పాటు చేశారు.

కొత్తగా మద్యం దుకాణాలు దక్కించుకున్న వ్యాపారులకు

మిగతా 8వ పేజీలో...

మద్యం విక్రయాలు మూడింతలు

పంచాయతీ ఎన్నికలతో మద్యం విక్రయాలు భారీగా పెరిగే అవకాశం ఉంది. ఒక్కో నెలలో సాధారణంగా రూ.55 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు మద్యం విక్రయాలు జరుగుతుండగా, ఈ నెలలో పంచాయతీ ఎన్నికలు, నూతన సంవత్సర వేడుకలు కూడా కలిసి రావడంతో మద్యం దుకాణాలకు కిక్కే కిక్కు. పంచాయతీ ఎన్నికలతో ఇప్పటికే మద్యానికి బాగా డిమాండ్ ఏర్పడింది. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు ముందుగానే తమకు సరఫరా చేయాల్సిన వివిధ రకాల బ్రాండ్ల మద్యం గురించి మద్యం దుకాణాలకు ఆర్డర్ ఇస్తున్నారు. మద్యం డిమాండ్ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఆర్డర్ ఇచ్చిన రెండు రోజుల తర్వాత మద్యం పంపిస్తున్నట్లు తెలుస్తోంది. పంచాయతీ ఎన్నికల ప్రభావంతో మద్యం వ్యాపారులు ముందుగానే డిపోల నుంచి మద్యం నిల్వలు తెచ్చుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పంచాయతీ ఎన్నికలు, నూతన సంవత్సర వేడుకలతో డిసెంబరు నెలలో ఎక్సైజ్ శాఖకు భారీగా ఆదాయం సమకూరే అవకాశం ఉంది.

దృఢ సంకల్పంతో ముందుకెళ్లాలి

- అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు దృఢ సంకల్పంతో ముందుకు సాగితే అన్ని రంగాల్లో విజయం సాధించగలుగుతారని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకుని బుధవారం జిల్లా మహిళా సమాఖ్య కార్యాలయంలో జిల్లా మహిళా శిశు దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ దివ్యాంగులు తమలోని లోపం గురించి ఆవేదన చెందకుండా లక్ష్యాలను నిర్దేశించుకొని ముందుకెళ్లాలని అన్నారు. రాజ్యాంగం అందరికీ సమాన హక్కులు కల్పించిందని, దివ్యాంగులు తమకు కల్పించిన హక్కుల గురించి తెలుసుకుని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకుని నిర్వహించిన దివ్యాంగుల కీడాపోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి ఆయన ప్రశంసాపత్రంతో పాటు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి కృష్ణవేణి, మెప్మా పీడీ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.



విజేతకు ప్రశంసాపత్రం అందజేస్తున్న లింగ్యానాయక్



నామినేషన్ల ప్రక్రియను పరిశీలిస్తున్న యాస్మిన్ బాషా

ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి

- జిల్లా ఎన్నికల పరిశీలకులు యాస్మిన్ బాషా

యాలాల, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఎన్నికలు ఎలాంటి సమస్యలు లేకుండా పాదర్శకంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల పరిశీలకులు షేక్ యాస్మిన్ బాషా అధికారులకు సూచించారు. బుధవారం యాలాల మండల పరిధిలోని కమాల్‌పూర్ క్లస్టర్‌లో నామినేషన్ల ప్రక్రియను కలెక్టర్ ప్రతీక్ జైన్, అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరిలతో కలిసి పరిశీలించారు. కమాల్‌పూర్ క్లస్టర్‌లో కమాల్‌పూర్, విశ్వనాథ్‌పూర్, రాఘవాపూర్ గ్రామపంచాయతీలకు సంబంధించిన నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందని రిటర్నింగ్ అధికారులు వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రిటర్నింగ్ అధికారులు నామినేషన్ల ప్రకియలో ఎలాంటి తప్పులు, పొరపాట్లు లేకుండా చూడాలని ఆదేశించారు. అలాగే నామినేషన్ల పత్రాలను జాగ్రత్తగా భద్రపరచాలని ఆమె సూచించారు. పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుడు ఒక్కటే నామినేషన్ వచ్చినప్పటికీ ఏకగ్రీవంగా ప్రకటించకుండా నిబంధనలకు అనుగుణంగా రిటర్నింగ్ నడుచుకోవాలని సూచించారు. నామినేషన్ల ప్రక్రియ పరిశీలనలో ఎంపీడీవో శ్రీనిజ, రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

తొలిరోజు అంతంతమాత్రమే

కొనసాగుతున్న మూడో విడత నామినేషన్లు

- 157 సర్పంచ్ స్థానాలకు 100
- 1,340 వార్డులకు 200 నామినేషన్లు దాఖలు
- బ్రాహ్మణ్‌పల్లి పెద్దతండా ఏకగ్రీవం

తొండపల్లిలో నామినేషన్ దాఖలు చేస్తున్న సర్పంచ్ అభ్యర్థి బావయ్య



పరిగి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల తుది విడత పోరు ప్రారంభమైంది. సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికకు సంబంధించి బుధవారం అధికారులు ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. అనంతరం క్లస్టర్ కేంద్రాల పంచాయతీ కార్యాలయాల్లో సర్పంచ్, వార్డు సభ్యులకు సంబంధించి నామినేషన్లను స్వీకరించారు. అయితే తొలిరోజు బుధవారం నామినేషన్ల ప్రక్రియ అంతంత మాత్రంగానే కొనసాగింది. తుది విడత ఎన్నికలు జిల్లాలోని పరిగి, దోమ, కులకచర్ల, పూడూరు, చౌడాపూర్ మండలాల్లో జరుగుతున్నాయి. మొత్తం 157 సర్పంచ్, 1,340 వార్డు సభ్యులకు ఎన్నికలు జరగనున్నాయి. తొలిరోజు సర్పంచ్

మిగతా 8వ పేజీలో...

బ్రాహ్మణ్‌పల్లి పెద్దతండా ఏకగ్రీవం

దోమ మండలం బ్రాహ్మణ్‌పల్లి పెద్దతండా సర్పంచ్ ఏకగ్రీవమైంది. గ్రామ పెద్దల సమక్షంలో సమావేశం నిర్వహించి ఏకగ్రీవంగా సర్పంచ్‌గా నేనావత్ సురేఖను ఎన్నుకున్నారు. అలాగే ఉప సర్పంచ్‌గా జరుప్లా రమేశ్‌లతో పాటు, ఎమినిది వార్డు సభ్యులను కూడా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయా స్థానాలకు ఒక్కొక్కరే నామినేషన్‌లు దాఖలు చేయడంతో ఏకగ్రీవం కానుంది. కాగా, అధికారికంగా ప్రకటిచాల్సి ఉంది.

నేడు మేడ్చల్ పారిశ్రామికవాడలో ధర్నా

మేడ్చల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నేడు మేడ్చల్ పారిశ్రామిక ప్రాంతంలోని బస్‌స్టాప్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించనుంది. రాష్ట్రంలోని విలువైన పరిశ్రమలకు చెందిన భూములను కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డగోలుగా ప్రైవేటు సంస్థలకు అమ్మకాలు చేస్తున్నందున నిరసనగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం చేపడుతోంది. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎమ్మెల్సీ, జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు శంబీపూర్ రాజులు హాజరు కానున్నట్లు తెలిపారు. అలాగే బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరై ధర్నాను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు కోరారు.

సీఎం వ్యాఖ్యలను వక్రీకరించారు

- బీజేపీపై మండిపడిన డీసీసీ అధ్యక్షుడు వజ్రేశ్‌యాదవ్



మేడ్చల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ప్రజల్లో వైషమ్యాలు పెంచేలా బీజేపీ నాయకుల ప్రవర్తన ఉందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు తోటకూర వజ్రేశ్ యాదవ్ మండిపడ్డారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వాఖ్యలను బీజేపీ నాయకులు కావాలనే వక్రీకరించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన కాంగ్రెస్ పార్టీ సమావేశంలో మాట్లాడుతూ హిందూ దేవతల్లోనే ఒక్కొక్కరి అభిప్రాయం.. ఒక్కోలా ఉందని అలాంటిది కాంగ్రెస్ పార్టీలో ఉన్న నాయకుల అభిప్రాయాలు ఒకేలా ఉండవని మాత్రమే అన్నారని గుర్తు చేశారు. ఈ విషయంలో బీజేపీ నాయకులు పునఃసమీక్షించుకోవాలన్నారు. కేవలం మతపరమైన రాజకీయాలే కాకుండా తెలంగాణ అభివృద్ధి కోసం బీజేపీ ఎంపీలు కృషి చేయాలని ఆయన కోరారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

- జిల్లా వైద్యాధికారి స్వర్ణకుమారి



డాక్టర్‌తో మాట్లాడుతున్న స్వర్ణకుమారి

కొడంగల్ / దౌల్తాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాసుపత్రుల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి స్వర్ణకుమారి సూచించారు. బుధవారం కొడంగల్ మండలంలోని అంగడిరైచూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కొడంగల్‌లో బస్తీ దవాఖానా, దౌల్తాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆసుపత్రుల్లో రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రుల్లో అందుతున్న సేవలు, సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రులకు వచ్చే రోగుల పట్ల వైద్య సిబ్బంది ఇబ్బందులకు గురి చేయరాదని సూచించారు. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించకుండా ప్రభుత్వ నిబంధనలకు లోబడి వైద్య సేవలు అందించాలన్నారు. వైద్యులు, సిబ్బంది సమయ పాలన పాటించాలని, లేని పక్షంలో చర్యలు తప్పవన్నారు. ఈ సందర్భంగా జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌వో రవీందర్‌యాదవ్, వైద్యులు అమూల్య ప్రియదర్శిని, సిబ్బంది ఉన్నారు.



నూతన ప్రభుత్వ పాఠశాలను ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ రాధికాగుప్తా

ఉచిత విద్యను సద్వినియోగం చేసుకోవాలి

- అదనపు కలెక్టర్ రాధికాగుప్తా

కీసర రూరల్, డిసెంబర్ 3 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న ఉచిత విద్యను పేద, మధ్య తరగతి వర్గాల వారు సద్వినియోగం చేసుకోవాలని మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా అన్నారు. బుధవారం నాగారం మున్సిపాలిటీ రాంపల్లిలోని డబుల్ బెడ్ రూం ఇళ్ల సముదాయం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలను, జిల్లా విద్యాశాఖాధికారి విజయకుమారితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన వారికి ఉచితంగా విద్యనందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ పాఠశాలను స్థానికులు వినియోగించుకోవాలన్నారు. పాఠశాల నిర్వహణకు త్వరలోనే సొంత భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి జమదగ్ని, మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి, కీసర, చీర్యాల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రాంరెడ్డి, రవీంద్‌రెడ్డి, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

వారంలో 2 రోజులు ప్రజావాణి

- వికారాబాద్ ఎస్పీ స్నేహ మెహ్రా



వికారాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతీ వారం రెండు రోజుల పాటు ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎస్పీ స్నేహ మెహ్రా తెలిపారు. ప్రతి మంగళ, గురువారాల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఎస్పీ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో బాధితులు, ఫిర్యాదుదారులు తమ సమస్యలను తెలపాలన్నారు. అపరిష్కృత సమస్యలతో పాటు ఇతర అన్ని రకాల సమస్యలను కూడా తన దృష్టికి తీసుకు రావచ్చని తెలిపారు. ఫిర్యాదుదారులు, బాధితులు ఎలాంటి సంకోచం లేకుండా ధైర్యంగా తమ సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

సందర్శకులకు సదుపాయాలు మెరుగుపర్చాలి

- అటవీశాఖ ముఖ్య సంరక్షణాధికారి డాక్టర్ ప్రియాంక వర్గీస్



అనంతగిరి అందాలను వీక్షిస్తున్న ప్రియాంక వర్గీస్

వికారాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అనంతగిరికి వచ్చే సందర్శకులకు సదుపాయాలు, వసతులు మరింతగా మెరుగుపర్చేలా చర్యలు తీసుకోవాలని చార్మినార్ సర్కిల్ అటవీ ముఖ్య సంరక్షణాధికారి డాక్టర్ ప్రియాంక వర్గీస్ డీఎఫ్ఓకు సూచించారు. బుధవారం ఆమె అనంతగిరిలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతగిరి ఎకో అర్బన్ పార్క్ పనులతో పాటు 2024-25 సంవత్సరంలో చేపట్టిన ప్లాంటేషన్ పనులను ఆమె తనిఖీ చేశారు. అనంతగిరి అర్బన్ పార్క్‌లోని వాచ్ టవర్, గెజిబో పనులను పరిశీలించారు. అంతకు ముందు ధారూరు రేంజ్ పరిధిలోని రుద్రారం రిజర్వు ఫారెస్టులో 10 హెక్టార్ల ఎస్ఎంఎం ప్లాంటేషన్ పనులను ఆమె పరిశీలించారు. కాగా, వారి వెంట జిల్లా అటవీ శాఖ అధికారి జి.జ్ఞానేశ్వర్, వికారాబాద్, ధారూరు రేంజ్ అధికారులు శ్యామ్‌కుమార్, రాజేందర్, సెక్షన్, బీట్ అధికారులు తదితరులు ఉన్నారు.

శ్వాస తీసుకోలేడు..

అన్నం తినలేడు

- ఏడాది గడిచినా దయనీయ స్థితిలోనే శ్రీతేజ్
- ఒంటినిండా ట్యూబులతో మంచంపై నిశ్చేష్టంగా
- పైపుతో ద్రవాహారం.. ప్రతి రోజూ థెరపీలు
- సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనకు ఏడాది
- కొడుకు కోసం ఉద్యోగం మానేసి తండ్రి సపర్యలు
- నెలకు రూ.1.50 లక్షల దాకా అవుతున్న ఖర్చు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): పుష్ప-2 సినిమా.. నిర్మాతలకు కాసుల పంట పండించి ఉండొచ్చు. అల్లు అర్జున్‌ను పాన్ ఇండియా స్టార్‌గా మరో మెట్టు ఎక్కించి ఉండొచ్చు. కానీ, ఒక కుటుంబానికి మాత్రం జీవిత కాలపు పీడకలను మిగిల్చింది. రెండు తెలుగు రాష్ట్రాలను తీవ్రంగా కలవర పెట్టిన ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని సంధ్య థియేటర్ దుర్ఘటన జరిగి బుధవారంతో ఏడాది అవుతోంది. అమ్మ, నాన్న, చెల్లితో కలిసి తన అభిమాన నటుడి సినిమా చూడడానికి వెళ్లిన పదేళ్ల శ్రీతేజ్.. తొక్కిసలాటలో తల్లిని కోల్పోయాడు. అదే ఘటనలో తీవ్రంగా గాయపడిన శ్రీతేజ్.. తన తల్లి ఇక లేదన్న సంగతి కూడా గుర్తించలేని స్థితిలో మంచం మీద నిశ్చేష్టంగా పడి ఉంటున్నాడు. ప్రమాదం జరిగి ఏడాది అవుతున్నా.. ఇంకా ఆ కుటుంబం కోలుకోకపోగా మరింత దుఃఖంలో కూరుకుపోయింది. ఆస్పత్రి నుంచి శ్రీతేజ్ ఆరు నెలల కిందట డిశ్చార్జి అయ్యాడు కానీ, అతని ఇల్లే ఇప్పుడు దవాఖానాగా, మారింది. తండ్రే నర్సు అయి నిరంతరం సపర్యలు చేస్తున్నారు. శ్రీతేజ్ తనంతట తానుగా అన్నం తినలేడు. అందుకే కడుపులోకి నేరుగా ద్రవాహారాన్ని పంపించేందుకు గ్యాస్ట్రోస్టోమీ పైపు అమర్చారు. శ్వాసకూడా తీసుకోలేడు. దాంతో గాలి నేరుగా ఊపిరితిత్తుల్లోకి వెళ్లడానికి మెడ ముందు భాగంలో రంధ్రం చేసి ట్రాకియోస్టోమీ ట్యూబ్ పెట్టారు. దీంతో శ్రీతేజ్ ఒంటినిండా ట్యూబులతో పొత్తిళ్లలో పసిబిడ్డలా ఉలుకూ పలుకూ లేకుండా పడి ఉంటున్నాడు.

ప్రతిరోజూ థెరపీలు..

శ్రీతేజ్ ఆకలి అని సైగ కూడా చేయలేడు. తొక్కిసలాటలో చిన్నారి మెదడు కణాలు 70 శాతం దెబ్బతినడమే ఇందుకు కారణం. తన చిటికెన వేలు పట్టుకొని నడవాల్సిన బాబును చేతుల్లోకి ఎత్తుకొని మోయాల్సి వస్తోందంటూ శ్రీతేజ్ తండ్రి కన్నీటి పర్యంతమయ్యారు. "రోజూ సికింద్రాబాద్‌లోని ఆసియా ట్రాన్స్‌కేర్ రిహాబిలిటేషన్ సెంటర్‌లో కొన్ని నెలలుగా బాబుకు స్వాలో(మింగడం), స్పీచ్(మాట్లాడటం) థెరపీ ఇప్పిస్తున్నాం. అక్కడే అడ్మిట్ చేస్తే నెలకు రూ.90 వేలకు పైగా ఫీజు చెల్లించాలి. బాబును చూసుకోడానికి ఒక మనిషి అక్కడే ఉండాలి. ఇంట్లో 6ఏళ్ల నా కూతురు, 75 ఏళ్ల మా అమ్మ బాగోగులు కూడా నేనే చూసుకోవాలి. ఇంటి పనులు చక్కబెట్టుకొని.. పాపను స్కూలుకు పంపించిన తర్వాత దిల్‌సుఖ్‌నగర్ నుంచి సికింద్రాబాద్‌కు రోజూ క్యాబ్‌లో బాబును తీసుకొచ్చి థెరపీలు ఇప్పిస్తున్నాను. రోజుకు రూ.2 వేల చొప్పున థెరపీలకే రూ.60 వేలకుపైన కడుతున్నాను. ఫిజియోథెరపీ చేయిస్తున్నాం. అదీ రూ.30 వేలవరకు అవుతుంది. ప్రతి నెలా కేవలం థెరపీలకే తక్కువలో తక్కువ రూ.90 వేలు కడుతున్నాను. కనీసంగా 2 నుంచి 3 ఏళ్లు నిరంతరం థెరపీలు ఇప్పిస్తే బాబు కోలుకోవచ్చని డాక్టర్లు చెప్పారు" అని శ్రీతేజ్ తండ్రి భాస్కర్ వివరించారు.

కొడుకు కోసం ఉద్యోగం వదిలేసి...

శ్రీతేజ్‌కు ప్రతి మూడు గంటలకు ఒకసారి గ్యాస్ట్రో స్టోమీ ట్యూబ్ ద్వారా ద్రవాహారం అందిస్తుండాలి. ప్రతి రెండు గంటలకు ఒకసారి మెడ దగ్గర అమర్చిన ట్రాకియోస్టోమీ పైపులోని తెమడ వంటి ద్రవాన్ని శుభ్రం చేయాలి. నిరంతరం డైపర్లు మారుస్తుండాలి. నిత్యం వేడినీళ్లతో ఒళ్లు తుడిచి దుస్తులు వేయాలి. ఇవన్నీ చేయాలంటే ఇద్దరు మనుషుల పర్యవేక్షణ అవసరం. ఇదంతా చేయడానికి ఇంటిపట్టున ఉండే శ్రీతేజ్ నాయనమ్మకు అసాధ్యం. "ఇదివరకు బంగారం దుకాణంలో పనిచేసేవాడిని. అదే నా కుటుంబానికి ఆదరువు. ప్రమాదం తర్వాత మా జీవితం తలకిందులయింది. బాబును చూసుకోడానికి ఇంటిపట్టునే ఉంటున్నాను. మరోపక్క మా అమ్మాయిని కూడా సముదాయించాలి. ఇప్పటికి ఒక్కోరోజు అర్ధరాత్రి నిద్రలేచి అమ్మా అని పాప ఏడుస్తుంటుంది" అని చెబుతూ భాస్కర్ కన్నీటిపర్యంతమయ్యారు. ఏప్రిల్‌లో శ్రీతేజ్ ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయినప్పటి నుంచి క్రమం తప్పకుండా థెరపీలు ఇప్పించడం వల్ల కొంచెం మార్పు కనిపిస్తోందని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ప్రమాదం అనంతరం శ్రీతేజ్ కాళ్లు పూర్తిగా ముడుచుకుపోవడంతో జూన్‌లో మరొక ప్రైవేటు ఆస్పత్రిలో కాళ్లకు శస్త్రచికిత్స చేయించారు. "కాళ్లకు ఆపరేషన్‌తో పాటు ఇప్పటివరకు థెరపీలకు రూ.20లక్షలు చెల్లించాం. శ్రీతేజ్‌కు థెరపీలు, ఇతర మందులు, డైపర్లు, ప్రత్యేకమైన ఆహారం వంటివన్నీ కలిపి నెలకు రూ.1.25 లక్షలు పైన ఖర్చు అవుతుంది. ఇక ఇంటి అద్దెతోపాటు పాప చదువుకు, అమ్మ మందులకు అయ్యేదంతా అదనం" అని శ్రీతేజ్ బాబాయి మల్లికార్జున ఆవేదన వ్యక్తం చేశారు.

తమదే బాధ్యత అని చెప్పారు కానీ..



తొక్కిసలాటలో తన భార్య చనిపోవడంతో.. జరగరాని నష్టం జరిగిందంటూ అల్లు అర్జున్ కుటుంబం తన పిల్లల పేరుమీద రూ.2 కోట్లు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారని శ్రీతేజ్ తండ్రి భాస్కర్ చెప్పారు. ఆ మొత్తానికి నెల నెలా బ్యాంకు వడ్డీ తీసుకునే అవకాశం కల్పించారని, కానీ.. ఆ వడ్డీ డబ్బులు.. బాబు వైద్య చికిత్స ఖర్చులకు ఏమాత్రం సరిపోవడంలేదని అన్నారు. నెలకు రూ.2 లక్షల ఖర్చుకుతోడు జూన్‌లో బాబు కాళ్లకు ఆపరేషన్ చేయించినప్పుడు అదనంగా రూ.3 లక్షలు ఖర్చయ్యాయని తెలిపారు. బాబుకు సపర్యలు చేసేందుకు, చికిత్స చేయించేందుకు ఉద్యోగం కూడా మానేయడంతో ఎటువంటి ఆదాయం లేదని పేర్కొన్నారు. శ్రీతేజ్ ఆస్పత్రిలో ఉన్న సమయంలో.. అతడు పూర్తిగా కోలుకునే దాకా తమదే బాధ్యత అని, వైద్య చికిత్సకు అయ్యే ఖర్చులన్నీ భర్తిస్తామని అల్లు అర్జున్ కుటుంబం హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఇదే విషయమై అల్లు అర్జున్‌కు గుర్తు చేసేందుకు ఆయన మేనేజర్ కాంతారావును సంప్రదించగా.. సానుకూల స్పందన రాలేదని తెలిపారు. కనీసం బాబు థెరపీల ఖర్చు వరకైనా సాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

సీసీఐ కర్మాగార అభివృద్ధికి

రూ.వంద కోట్లు ఇవ్వండి

తాండూరు రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆసియా ఖండంలోనే పెద్ద పరిశ్రగా వెలుగొందిన వికారాబాద్ జిల్లాలోని కరన్‌కోట్ సీసీఐ కర్మాగార ఆధునికీకరణకు సహకరించాలని కర్మాగార అధికారులు బుధవారం కేంద్ర మంత్రి, ఎంపీని వేర్వేరుగా కలిసి వినతిపత్రాలు అందజేశారు. కర్మాగారం అధికారులు ఢిల్లీలో కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి కుమారస్వామి, చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డిలను కలిసి కర్మాగార డెవలప్‌మెంట్ కోసం రూ.100కోట్లు కేటాయించాలని కోరారు. ప్యాకింగ్ ప్లాట్, సిమెంట్, కోల్ మిల్, కింక్లర్ విభాగా ఆధునికీకరణకు నిధులివ్వాలని కోరారు. 40సంవత్సరాల క్రితం కర్మాగారం ఏర్పాటు చేశారని, ప్రస్తుతం యంత్రాలన్నీ రిపేర్లకు వచ్చాయని, ప్రైవేటు కంపెనీలకు దీటుగా కరన్‌కోట్ సిమెంట్ కర్మాగారాన్ని రెన్యోవేషన్ చేయాల్సి ఉందన్నారు. దీనికి మంత్రి, ఎంపీ సానుకూలంగా స్పందించినట్లు అధికారులు పేర్కొన్నారు.



కేంద్ర మంత్రి కుమారస్వామిని కలిసిన సీసీఐ అధికారులు



అవగాహన కల్పిస్తున్న రాచకొండ ఏహెచ్‌టీయూ పోలీసులు

చట్టాలపై విద్యార్థులకు అవగాహన

ఘట్‌కేసర్, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): బాల కార్మికులు, నిర్బంధ కార్మికులు, బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని రాచకొండ కమిషనరేట్ ఎస్ఐ ఎండీ ఖలీల్ అహ్మద్ అన్నారు. బుధవారం అన్నోజిగూడ జెడ్పీ స్కూల్‌లో విద్యార్థులకు వివిధాంశాలపై అవగాహన కల్పించారు. మహిళలను మోసగించినా, అపహరించినా కఠిన శిక్షలుటాయని గుర్తుచేశారు. సైబర్ బెదిరింపులు, మోసాలకు గురైతే డయల్ 1930, ఉమెన్ హెల్ప్‌లైన్ 1091, 181, చైల్డ్ హెల్ప్‌లైన్1091, 112, డయల్ 100 నంబర్లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐలు రంగారెడ్డి, మీనాకుమారి, సిబ్బంది భానుప్రసాద్, రజిత, హెచ్ఎం ప్రతాపరెడ్డి, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

టెక్నాలజీని వినియోగిస్తేనే దేశం అభివృద్ధి

ఘట్‌కేసర్, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): డిజిటల్ యుగంలో టెక్నాలజీని సృజనాత్మకంగా వినియోగిస్తేనే ప్రపంచంలో దేశం ముందంజ వేస్తుందని రాష్ట్ర ఉన్నత విద్యా కౌన్సిల్ చైర్మన్ బాలకిష్టారెడ్డి అన్నారు. బుధవారం కొండాపూర్‌లో గల సంస్కృతి ఇంజనీరింగ్ కళాశాలలో వివిధ సంస్థల ఆధ్వర్యంలో బిల్డ్-ఎ థాన్ అధ్యాపకులకు శిక్షణ సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథి బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ.. సాంకేతికతను సమర్థంగా ఉపయోగించుకోవడం విద్యార్థుల భవిష్యత్తుకు కీలకం అన్నారు. కొత్తకొత్త ప్రయోగాలు చేపట్టాలని సూచించారు. శిక్షణలో 200మంది అధ్యాపకులు పాల్గొన్నారు. శిక్షణను పూర్తి చేసిన 60మందికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో టాస్క్ సీఈవో శ్రీకాంత్‌సిన్హా, కళాశాల చైర్మన్ ఏవీ రమణారెడ్డి, డైరెక్టర్ రమాకాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ జానకిరాములు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర ఉన్నత విద్య కౌన్సిల్ చైర్మన్ బాలకిష్టారెడ్డి

అనురాగ్‌లో 'అగ్రికల్చర్ ఎడ్యుకేషన్ డే'

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, అవుశాపూర్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో బుధవారం వ్యవసాయ విద్యాదినోత్సవం సందర్భంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వ్యవసాయ ప్రదర్శన నిర్వహించారు. వర్సిటీ డీన్ నారాయణరెడ్డి దేశం అగ్రి రంగంలో సాధించిన పురోగతిని విద్యార్థులకు తెలియజేశారు. వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్.స్వామినాథన్ విడమర్చిన అంశాలపై వివరించారు. వ్యవసాయం బాగుంటేనే దేశ ఆర్థిక వ్యవస్థ బాగుంటుందని అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను, పండ్ల తోటలు, మ్యూజియం, పాలి హౌజ్‌లను విద్యార్థులు సందర్శించారు.



ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దు

వికారాబాద్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లు చేసే మోసాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని డీటీసీ డీఎస్పీ శ్రీనివాస్, వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డిలు అన్నారు. జిల్లా పోలీస్ యంత్రాంగం ఆధ్వర్యంలో బుధవారం వికారాబాద్‌లోని విశ్వభారతి కళాశాలలో 'ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్‌'పై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్లు కొత్త పద్ధతుల్లో లింకులు, సందేశాలు, నకిలీ మెయిల్ పంపి మోసాలకు పాల్పడుతున్నారన్నారు. వాట్సాప్ లింకులు, సందేశాలకు స్పందించొద్దన్నారు. మోసపోతే వెంటనే నేషనల్ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ సెంటర్ 1930కు కాల్ చేయాలని తెలిపారు. తాము సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉంటామని, మోసాలకు గురికామని అప్రమత్తం అవుతామని విద్యార్థులు, కళాశాల సిబ్బందితో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో ఎస్‌హెచ్‌వో భీంకుమార్, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న పోలీసు అధికారులు శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, భీంకుమార్

హిందువుల మనోభావాలను దెబ్బతీసిన సీఎం

మేడ్చల్ టౌన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): హిందువులు ఆరాధించే దేవతల పట్ల అనుచిత వాఖ్యలు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే ప్రజలకు క్షమాపణ చెప్పాలని మేడ్చల్ పట్టణ బీజేపీ అధ్యక్షురాలు శైలజహరినాథ్ అన్నారు. బుధవారం మేడ్చల్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీల్లో బీజేపీ నాయకులు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. శైలజ మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి దేవతల పట్ల అనుచిత వాఖ్యలు చేసి హిందువులందరినీ అవమానించాడన్నారు కార్యక్రమంలో బీజేపీ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, జగన్‌గౌడ్, ప్రేమ్‌దాస్, హంసరాణి కృష్ణగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, వంశీ, సుధాకర్‌రెడ్డి, మురళీధర్ పాల్గొన్నారు.

హిందూ దేవుళ్లపై సీఎం వ్యాఖ్యలు సరికాదు

కేశంపేట, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): సీఎం హోదాలో రేవంత్ రెడ్డి హిందు దేవుళ్లపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని బీజేపీ జిల్లా సంస్కృతిక శాఖ కో కన్వీనర్ కర్రెడ్ల నరేందర్ రెడ్డి అన్నారు. కేశంపేట మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం ఆయన బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు కంచుకోట మహేష్, కుమార్ గుప్తాతో కలిసి విలేకరులతో మాట్లాడారు. రేవంత్ రెడ్డి హిందూ దేవుళ్లపై వ్యాఖ్యలు చేసినట్లు ఇతర మతాల దేవుళ్లపై చేస్తాడా.. అని ప్రశ్నించారు. జూబ్లీహిల్స్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ అంటే ముస్లింల పార్టీ అని నిరూపించుకుందని విమర్శించారు. రాజకీయంలో ఓ వర్గం మద్దతు కూడగట్టేందుకు ఇంతలా దిగజారడం కాంగ్రెస్‌కే చెల్లిందని ఎద్దేవా చేశారు. హిందువులపై ఇంతగా ద్వేషం ఎందుకు నింపుకున్నారో ముఖ్యమంత్రి చెప్పాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి ఇకనైనా హిందువులు, హిందూ దేవుళ్లను కించపరచడం మానుకోవాలని సూచించారు.



నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

మత విద్వేషాలను రెచ్చగొడుతున్న బీజేపీ

మేడ్చల్ టౌన్ : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను బీజేపీ సోషల్ మీడియాతో వక్రీకరించి రాష్ట్రంలో మత విద్వేషాలు పెంచే యత్నం చేస్తోందని మేడ్చల్ నియోజకవర్గం ఎ-బ్లాక్ కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పానుగంటి మహేష్ కుమార్ అన్నారు. బీజేపీ నాయకులు ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను దహనం చేయడంపై మండిపడ్డారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పక్కనపెట్టి కులమతాల మధ్య చిచ్చుపెట్టి బీజేపీ రాజకీయ లబ్ధికి యత్నిస్తోందని అన్నారు.

పోటీ లేకుండా ఉండేందుకు...

పార్టీ నుంచి ఒక్కఅభ్యర్థే ఉండేలా నాయకుల మంతనాలు

కులకచర్ల, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పోటీ లేకుండా కాంగ్రెస్ నాయకులు అభ్యర్థుల మధ్య రాజీ కుదుర్చుతున్నారు. బుధవారం నుంచి సర్పంచ్, వార్డులకు నామినేషన్లు స్వీకరించనున్నారు. ఇప్పటికే గ్రామాల్లో పోటీచేసే అభ్యర్థుల జాబితా నాయకుల వద్ద ఉంది. పార్టీ నుంచి గ్రామానికి ఇద్దరు, ముగ్గురు పోటీ పడుతున్నారు. వారిలో ఒక్కరే పోటీలో ఉండేలా డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ టీఎస్.ఆంజనేయులు, మండల ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్ ప్రయత్నాలు చేస్తున్నారు.



ఓటు హక్కు నిర్భయంగా వినియోగించుకోవాలి

చౌదరిగూడ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని జిల్లేడ్ చౌదరిగూడ ఎస్సై విజయ్ సూచించారు. బుధవారం మండల పరిధిలోని చౌదరిగూడ, ఇంద్రనగర్‌లో పోలీస్ శాఖ ఆదేశాల మేరకు సిబ్బందితో రెండు గ్రామాల్లో కవాతు నిర్వహించారు. ఓటర్లు ప్రలోభాలకు లొంగకుండా తమ అమూల్యమైన ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించుకునేందుకు ప్రజలందరూ సహకరించాలన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. ఏఎస్ఐ చక్రీనాయక్, సిబ్బంది పాల్గొన్నారు.


చౌదరిగూడలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

పోస్టల్ బ్యాలెట్ ఓట్లకు కూడా

స్వస్తిక్ గుర్తునే వాడాలి

» ఎంపీడీవోకు యూటీఎఫ్ నాయకుల వినతి

బొంరాస్‌పేట్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పోస్టల్ బ్యాలెట్ ద్వారా కాకుండా స్వస్తిక్ గుర్తుతో ఓటు వేసే అవకాశం కల్పించాలని బొంరాస్‌పేట్ మండల ఎంపీడీవో వెంకన్నగౌడ్‌కు యూటీఎఫ్ నాయకులు బుధవారం వినతిపత్రం ఇచ్చారు. ఫెడరేషన్ మండల అధ్యక్షుడు గోపాల్ మాట్లాడుతూ.. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగ, ఉపాధ్యాయులు వేసే పోస్టల్ బ్యాలెట్లలో కూడా సాధారణ ఓటర్లు వేసినట్టే స్వస్తిక్ గుర్తుతో వేసేలా అవకాశం ఇవ్వాలని కోరారు. ఓటింగ్ పూర్తయిన తర్వాత మొదట పోస్టల్ బ్యాలెట్లు లెక్కిస్తారు కాబట్టి ఉద్యోగులు సంతకంతో వేసే రహస్య ఓటు ద్వారా ఓటు ఎవరికి వేశారో బహిర్గతం అవుతుందని, ఇలా కాకుండా స్వాస్తిక్ సింబల్ వాడితే సంతకం లేకుండా అందరి గుర్తు ఒకేలా ఉంటుంది కాబట్టి ఏ ఉద్యోగి ఎవరికి ఓటు వేశారో తెలియదని అన్నారు. ఓటు ఎవరికి వేశారో బహిర్గతమైతే సొంతూళ్లలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు అభ్యర్థులతో ఇబ్బందులు ఏర్పడతాయన్నారు.



కొత్తూర్ మండలంలో 22 మంది వార్డు సభ్యుల ఏకగ్రీవం

» మక్తగూడ జీపీలో 8 వార్డులకు 7 ఏకగ్రీవం

కొత్తూర్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని 12 గ్రామపంచాయతీలలో 110వార్డులు ఉండగా, 224మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. 22వార్డులు ఏకగ్రీవమైనాయి. గూడూర్, కొడిచర్ల, ఇన్ముల్‌నర్వ, మల్లాపూర్ జీపీలలో ఒకటి చొప్పున ఏకగ్రీవమైనాయి. మక్తగూడలో 7, మల్లాపూర్‌తండాలో 5, పెంజర్లలో 4, వైఎం తండాలో 2 వార్డులు ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. మక్తగూడ గ్రామపంచాయతీలో 8వార్డులు ఉండగా, 7వార్డులు ఏకగ్రీవం కాగా, ఒక వార్డుకు పోటీ నెలకొని ఉంది.

కాగా, గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా సర్పంచ్, వార్డుసభ్యులకు నామినేషన్లు వేసిన పర్వంలో బుధవారం ఉపసంహరణ తర్వాత ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులకు అధికారులు గుర్తులను కేటాయించారు. సిద్దాపూర్ సర్పంచ్ అభ్యర్థులుగా బాసునాయక్, రెడ్యానాయక్, వైఎం తండాలో మంజుల, ముత్యాలి, ఎస్‌బీ పల్లిలో సుమిత్ర మల్లారెడ్డి, ఎమ్మె యాదమ్మ, కొడిచర్లలో కవితా కిరణ్, దాసరి యాదమ్మ, దయ్యాల నర్సమ్మ, కొడిచర్లతండాలో లక్ష్మీశంకర్, శాంతివిష్ణు, పెంజర్లలో ఎర్రోళ్ల జగన్, బ్యాగరి రాజు, దేశాల అంజమ్మ, సుధాకర్, భీమయ్య, రాములు, తీగాపూర్‌లో జయప్రద జగన్ మోహన్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, కుమార్, మల్లాపూర్‌లో నర్సింహారెడ్డి, చిన్నారెడ్డి, మల్లాపూర్‌తండాలో అనితా రాజునాయక్, మీనాక్షి దశరథ్, రాధా లక్ష్మణ్, గూడూర్‌లో దయానంద్ గుప్త, రాజుగౌడ్, ఆంజనేయులు ముదిరాజ్, మక్తగూడలో శ్రీరాములు, వడ్డే శేఖర్, ఇన్ముల్‌నర్వలో ఆగీర్ రవికుమార్‌గుప్త, లావుడ్యా గోపాల్ ఎన్నికల బరిలో ఉన్నారు. మొత్తం 12 గ్రామపంచాయతీలకు గాను 32మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు.

పంచాయతీ పోరు..

కొత్త పుంతలు

ప్రచారాస్త్రంగా సోషల్ మీడియా

- వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాల్లో ఓట్లడుగుతున్న అభ్యర్థులు
- కనిపించని పోస్టర్లు, వాల్ రైటింగ్స్, డోర్ స్టిక్కర్లు

ఆమనగల్లు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో అభ్యర్థులు ట్రెండ్ మార్చారు. స్మార్ట్ ఫోన్లతో ప్రచారాన్ని సాగిస్తున్నారు. డిజిటల్ మీడియా ప్రమోషన్లతో పంచాయతీ ఎన్నికలను కొంత పుంతలు తొక్కుతున్నారు. ప్రచారానికి సోషల్ మీడియాను విస్తృతంగా వాడుతున్నారు. వీడియోలతో ఎన్నికల పాటలు, సందేశాలు చిత్రీకరించి అప్లోడ్ చేస్తూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. వాట్సాప్ గ్రూపుల్లో, వ్యక్తిగతంగా, ఫేస్‌బుక్, ఇన్‌స్టగ్రామ్, ఏఐలను వినియోగించి సర్పంచ్, వార్డు స్థానాల అభ్యర్థులు ఓట్లను అభ్యర్థిస్తున్నారు. పార్టీల తరఫున వాట్సాప్ గ్రూపులు క్రియేట్ చేసి అభ్యర్థుల ఫొటోలను, గెలిపిస్తే గ్రామానికి చేసే సేవలు, అభివృద్ధి పనులపై వివరిస్తున్నారు. ఫోన్లతో వాయిస్ రికార్డులను పంపిస్తున్నారు. ఆమనగల్లు మండలంలో సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులు సోషల్ మీడియా ప్రచారాన్ని విస్తృతంగా చేస్తున్నారు. గతంలో పంచాయతీ ఎన్నికల్లో అభ్యర్థులు వాల్‌పోస్టర్లు, డోరు పోస్టర్లు, పాంప్లెట్లు, గుర్తులతో ప్రచారం వంటి వాటికి స్వస్తి పలికారు. చేసినా చాలా తక్కువ స్థాయిల్లో ఇలాంటి ప్రచారం ఉంది.



ఖర్చు తక్కువ.. ప్రయోజనం ఎక్కువ!

స్మార్ట్‌ఫోన్ల వినియోగం ఎక్కువైంది. ప్రతిదానికి ఫోన్‌నే వాడుతున్నారు. ఇది ఎన్నికల్లో పోటీచేస్తున్న వారికి కలిసొస్తోంది. సోషల్ మీడియా ద్వారా కేవలం ఫోన్లో డేటా ఉంటే చాలు.. తాము చెప్పాలనుకుంటున్నది ప్రజలకు చేరవేస్తూ అభ్యర్థులు ఎన్నికల ఖర్చును సైతం తగ్గించుకుంటున్నారు. అభ్యర్థులు వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేశారు. ఈ గ్రూపులను కూడా కులాలు, వార్డులు, యువజన, మహిళా సంఘాల వారీగా ఏర్పాటు చేసి ప్రచారం చేస్తూ ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనుల్లో ఉంటున్నారు. తమను గెలిపిస్తే సంఘాలకు, వార్డులకు, కుల సంఘాలకు చేసే ప్రయోజనాన్ని పోస్ట్ చేస్తున్నారు. మరికొందరు అభ్యర్థులు మరో అడుగు ముందుకేసి ఓటర్ల ఫోన్‌పే, గూగుల్‌పే నంబర్లను కూడ సేకరిస్తున్నట్లు సమాచారం.

ప్రింటింగ్ ప్రెస్‌లకు తగ్గిన గిరాకీ

డిజిటల్, సోషల్ మీడియా రాకతో ప్రింటింగ్ ప్రెస్‌లకు గిరాకీ తగ్గింది. గతంలో ఎన్నికలొచ్చాయంటే చేతినిండా పని దొరికేది. స్థానిక సంస్థల ఎన్నికల్లో గిరాకీ రెట్టింపయ్యేది. అయితే ప్రస్తుత పరిస్థితులు తలకిందులయ్యాయి. సోషల్ మీడియా, డిజిటల్ డిస్ప్లే, ఫ్లెక్సీల రాకతో ప్రిటింగ్ ప్రెస్‌ల వైపు చూసే వారే కరువయ్యారు.

ఎన్నికల్లో సమాన ఓట్లొస్తే...



బషీరాబాద్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి):సర్పంచి, వార్డు సభ్యుల ఎన్నికల్లో ఒక్కరి కంటే ఎక్కువ మందికి సమాన ఓట్లు వస్తే విజేతగా ఎవరిని ప్రకటిస్తారనే అనుమానం ప్రజలు, అభ్యర్థుల్లో ఉంటుంది. ఈ క్రమంలో అభ్యర్థులకు సమాన ఓట్లు వచ్చినప్పుడు అభ్యర్థుల పేర్లు రాసి డ్రా తీసి విజేతను ప్రకటిస్తారు. ఇది ఎన్నికల నియమావళిలో పొందుపర్చారు కూడా. సమాన ఓట్లొచ్చిన అభ్యర్థుల పేర్లను ఒకే రంగు, పరిమాణం కలిగిన ఐదేసి చిట్టీల్లో రాస్తారు. గుర్తుపట్టరాకుండా వాటిని కలుపుతారు. అభ్యర్థుల ఎదుటే అందులోంచి రిటర్నింగ్ ఆఫీసర్ ఒక్క చిట్టీ తీసి విజేతను ప్రకటిస్తారు. ఈ విషయంలో ఆర్వోకే ఎన్నికల సంఘం అధికారం ఇచ్చింది. ఆర్వో ఒక్కసారి విజేతను ప్రకటించిన తరువాత మార్పు ఉండదు. అయితే ఇదంతా పారదర్శకంగా నిర్వహించాల్సి ఉంటుంది.

పోస్టల్ బ్యాలెట్ పొందడమెలా?

కొత్తూర్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల వేళ మొదటి విడతలో భాగంగా షాద్‌నగర్ నియోజకవర్గంలోని 6మండలాలకు చెందిన గ్రామపంచాయతీలకు ఈనెల 11న ఎన్నికలు జరుగనున్నాయి. నామినేషన్ల ఉపసంహరణకు బుధవారం చివరి రోజు కావడంతో పలువురు అభ్యర్థులు పోటీ నుంచి తప్పుకున్నారు. బరిలో నిలిచిన అభ్యర్థులకు ఎన్నికల అధికారులు గుర్తులు కూడా కేటాయించారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసేవారు కింది నియమ నిబంధనలు పాటించాలి. అన్ని మండల కేంద్రాలలోని ఎంపీడీవో కార్యాలయంలో ఉండే ఎన్నికల స్టేజీ-2 అధికారి నుంచి పోస్టల్ బ్యాలెట్ పొందవచ్చును. ప్రభుత్వ ఉద్యోగికి ఎన్నికల డ్యూటీ ఉన్నట్లయితే, సంబంధిత అధికారి చేత ధ్రువీకరణ పత్రం తీసుకోవాలి. ఎన్నికల డ్యూటీ ధ్రువీకరణ పత్రాన్ని తీసుకొచ్చి దరఖాస్తు పూర్తి చేసి స్టేజీ-2 ఎన్నికల అధికారికి అందజేసి పోస్టల్ బ్యాలెట్‌ను పొందవచ్చును. ఏ మండలానికి చెందినవారు ఆ మండలంలోనే పోస్టల్ బ్యాలెట్‌ను పొందాలి. రేపటి నుంచి ఎంపీడీవో కార్యాలయాల్లో కూడా పొందవచ్చని తెలిపారు.

విలీనం.. అధికారికం

జీఓ 264పై పురపాలక శాఖ ఉత్తర్వులు.. జీహెచ్ఎంసీలోకి మునిసిపాలిటీలు, కార్పొరేషన్లు

రంగంలోకి బల్దియా.. రికార్డుల స్వాధీనం.. బ్యాంకు ఖాతాల స్తంభన.. డీఎంసీలకు బాధ్యతలు

రాత్రే కార్యాలయాలకు అధికారులు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీలో శివార్లలోని 20 మునిసిపాల్టీలు, ఏడు కార్పొరేషన్ల విలీనం అధికారికంగా పూర్తయ్యింది. ఈ మేరకు పురపాలక శాఖ బుధవారం ఉత్తర్వులు (జీఓ-264) జారీ చేసింది. ఈ నేపథ్యంలో పట్టణ స్థానిక సంస్థల కౌన్సిల్ తీర్మానాలు, మినిట్స్ బుక్ సీజ్, బ్యాంకు ఖాతాల స్తంభింప చేసి అందులోని డబ్బులను జీహెచ్ఎంసీ ఖాతాలోకి బదిలీ, కార్యాలయాలకు జీహెచ్ఎంసీ పేరిట బోర్డు ఏర్పాటు చేయాలని పేర్కొంటూ జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ ప్రొసీడింగ్స్ ఇచ్చారు. 30 మంది డిప్యూటీ మునిసిపల్ కమిషనర్ల (డీఎంసీ)లకు బాధ్యతలు అప్పగిస్తూ సాయంత్రం 6 గంటల సమయంలో ప్రొసీడింగ్స్ రాగా.. రాత్రే డీఎంసీలు రంగంలోకి దిగారు. ఆయా సంస్థల కార్యాలయాలకు వెళ్లి రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకు ఖాతాల ఫ్రీజ్‌కు లేఖలు సిద్ధం చేశారు.

రికార్డుల స్వాధీనం

నిర్మాణ అనుమతులు జారీ చేయకుండా, బిల్లులు చెల్లించకుండా పాలనా వ్యవహారాలను స్తంభింప చేశారు. మునిసిపాలిటీ స్వరూపం, ఉద్యోగులు, సిబ్బంది వివరాలు, స్థిర, చరాస్తులు, డిపాజిట్లు, పెట్టుబడులు, పన్నులు, పన్నేతర ఆదాయం, ప్రస్తుతం కొనసాగుతున్న పథకాలు, చేపట్టిన పనులు, చెల్లించాల్సిన బిల్లులు, మూడేళ్లలో జారీ చేసిన భవన నిర్మాణ/లే అవుట్ అనుమతుల జారీ వివరాలు సేకరించాలని ప్రొసీడింగ్స్‌లో పేర్కొన్నారు. రికార్డులు స్వాధీన ప్రక్రియను పర్యవేక్షించాలని జోనల్ కమిషనర్లకు సూచించారు. మునిసిపాల్టీలు, కార్పొరేషన్ల రికార్డుల స్వాధీనం, డేటా బదిలీకి సహకరించాలని మంగళవారమే కర్ణన్ కమిషనర్ అండ్ డైరెక్టర్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్‌కు లేఖ రాశారు. వివరాల సేకరణ, రికార్డుల స్వాధీనానికి సంబంధించి ప్రొఫార్మను ఆదేశాల్లో స్పష్టంగా పేర్కొన్నారు. విలీన మునిసిపాల్టీలకు సంబంధించిన సమగ్ర సమాచారం సేకరించనున్నారు. మునిసిపాలిటీ ఏర్పాటు? విస్తీర్ణం, గ్రేడ్, 2001, 2011 లెక్కల ప్రకారం జనాభా, ప్రస్తుతం ఉన్న కుటుంబాలు, వార్డులు, మురికివాడలు, ఉద్యోగులు, మూడేళ్లగా ఆదాయ, వ్యయాలు, మార్కెట్లు, తదితర వివరాలన్నీ ప్రొసీడింగ్స్‌లో పేర్కొన్న ఫార్మాట్‌లో సేకరించాలని సూచించారు. పూర్తి వివరాల సేకరణ నేడు లేదా రేపు పూర్తవుతుందని ఓ అధికారి తెలిపారు.



జోన్లలో కలిసిన మున్సిపాల్టీల వివరాలు

చార్మినార్ జోన్
- ఆదిభట్ల, బడంగ్ పేట్, జల్‌పల్లి, శంషాబాద్, తుర్కయాంజాల్

శేరిలింగంపల్లి జోన్
- బండ్లగూడ జాగీర్, మణికొండ, నార్సింగి, అమీన్‌పూర్, తెల్లాపూర్

ఎల్‌బీనగర్ జోన్
- మీర్‌పేట్, పెద్దఅంబర్‌పేట, తుక్కుగూడ, దమ్మాయిగూడ, ఘట్‌కేసర్, పిర్జాదిగూడ, పోచారం

సికింద్రాబాద్ జోన్
- బోడుప్పల్, జవహర్‌నగర్, నాగారం, తూంకుంట

కూకట్‌పల్లిజోన్
- దుండిగల్, గుండ్లపోచంపల్లి, కొంపల్లి, మేడ్చల్, నిజాంపేట్, బొల్లారం

బంగారం కోసమే వృద్ధురాలి హత్య

షాదూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): బంగారం కోసమే వృద్ధురాలిని హత్య చేశారని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా వెల్లడించారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆమె విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. చెన్‌గోముల్‌కు చెందిన బేగరి రాములమ్మ(80) గత నెల 18న తప్పిపోయింది. 21న ఆమె కుమారుడు నర్సింహులు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా 24న గ్రామంలోని జలీల్‌మియాకు చెందిన పాడుపడిన ఇంట్లో రాములమ్మ శవాన్ని నర్సింహులు గుర్తించాడన్నారు. రాములమ్మ చేతికి ఉన్న వెండి గాజులు, మెడలోని బంగారు గుండ్లు కన్పించలేదన్నారు. సీసీ ఫుటేజీల ద్వారా అనుమానితుడు బెల్కటూర్ నరేష్ అదుపులోకి తీసుకుని విచారించామని తెలిపారు. పథకం ప్రకారం 18న మధ్యాహ్నం రాములమ్మ వద్దకు మెహర్ అనే వ్యక్తి వచ్చాడు. అతడు నరేష్, భూతుల్‌లకు ఫోన్‌చేసి పిలిపించారు. ఇలా ముగ్గురు కలిసి రాములమ్మను మాటల్లో దింపి గొంతునులిమి చంపారన్నారు. ఆమె ఒంటిపై ఉన్న బంగారు గుండ్ల, వెండి గాజులు, ముక్కు పుడకను తీసుకుని గోనెసంచిలో శవాన్ని కట్టి అదేరోజు రాత్రి జలీల్‌ఖాన్ పాత ఇంట్లో పడేశారని ఎస్పీ వివరించారు. నిందితుల నుంచి ఆభరణాలు, హతురాలి ఇతర వస్తువులను స్వాధీన చేసుకున్నామని చెప్పారు. నిందితులను రిమాండ్‌కు తరలించామని ఎస్పీ తెలిపారు.

ఉల్లంఘనలపై టీజీపీసీబీ ఉక్కుపాదం

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాలుష్య నిబంధనలను ఉల్లంఘిస్తున్న పరిశ్రమలపై తెలగాణ కాలుష్య నియంత్రణ మండలి ఉక్కుపాదం మోపుతోంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ జిల్లాలతో పాటు నగర శివారులోని 49 పరిశ్రమలపై గత నవంబరు నెలలో ఆరోపణలు రాగా, టాస్క్‌ఫోర్సు అధికారులు తనిఖీలు నిర్వహించి పీసీబీకి నివేదిక సమర్పించారు. ఆయా నివేదికల ఆధారంగా తీవ్రమైన ఉల్లంఘనలకు పాల్పడిన ఆరు పరిశ్రమలకు మూసివేత ఉత్తర్వులు జారీచేసినట్లు పీసీబీ ఉన్నతాధికారులు బుధవారం ప్రకటించారు. మూసివేత/ఉత్పత్తి నిలిపివేత ఉత్తర్వులు జారీ అయిన పరిశ్రమల్లో రంగారెడ్డి జిల్లా నాగులపల్లికి చెందిన స్వర్ణా ప్లాస్టిక్, నల్గొండ జిల్లా దేవరకొండ సమీపంలోని వెంగమాంబ మైనింగ్ కంపెనీ, సిరిసిల్ల జిల్లాకు చెందిన గాజుల ఉమాకాంత్ ఫ్యాబ్రిక్ డైయింగ్ యూనిట్, యాదాద్రి జిల్లా చౌటుప్పల్ సమీపంలోని సహస్ర ఎన్విరో ప్రైవేటు లిమిటెడ్, సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని టీఈడబ్ల్యు ఆటోమేషన్ లిమిటెడ్, సిద్ధిపేట్ జిల్లా బస్వాపూర్ గ్రామంలోని ఆశీర్వాద్ మెటల్ ఇండస్ట్రీలు ఉన్నట్లు టీజీపీసీబీ స్పష్టం చేసింది.

కార్మికుల హక్కులను హరిస్తున్న ప్రభుత్వాలు

యాచారం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి) కార్మికులు, కర్షకుల హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హరిస్తున్నాయని, కేవలం దినసరి వేతనంతోనే జీవనం సాగిస్తున్న కార్మికులను ఆదుకోవడంలో పాలకులు ఘోరంగా విఫలమయ్యారని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ అన్నారు. ఈనెల 7, 8, 9వ తేదీల్లో నిర్వహించే రాష్ట్రస్థాయి సీఐటీయూ మహాసభలకు సంబంధించి పోస్టర్‌ను యాచారం మండల కేంద్రంలో ఆయన ఆవిష్కరించారు. భూపాల్ మాట్లాడుతూ సులభతర వాణిజ్య పేరుతో ప్రపంచ పెట్టుబడిదారులకు విధానాలను పాలకులు అవలంభించడం దారుణమన్నారు. నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని కార్మికులు డిమాండ్ చేస్తుంటే ఎందుకు పట్టించకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రుద్రకుమార్, ఎం.చంద్రమోహన్, మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఎర్ర అశోక్, జిల్లా కోశాధికారి కవిత, ఉపాధ్యక్షులు జగదీష్, కిషన్, మండల కార్యదర్శి చందూనాయక్ పాల్గొన్నారు.


యాచారం : పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్

మహాసభలను జయప్రదం చేయాలి

షాదూరు/యాలాల/తాండూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర ఐదో మహాసభలను జయప్రదం చేయాలని యూనియన్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ పిలుపునిచ్చారు. బుధవారం షాదూరులో మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు మెదక్‌లో రాష్ట్ర మహాసభలు జరుగుతాయన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలన్నారు. లేబర్ కోడ్లను రద్దుచేసే కార్మికులంతా ఏకతాటిపై ఉండాలన్నారు. కార్యక్రమంలో వనజ, ఉమాదేవి, ఆండాలు, పుష్ప, అలీ, నర్సింహులు, రాములు పాల్గొన్నారు. సీఐటీయూ రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ తాండూరులో ఆవిష్కరించారు. రాజీలేని పోరాటాలతోనే కార్మిక హక్కులను కాపాడుకుంటామన్నారు.

ఆలయాల అభివృద్ధికి పెద్దపీట

మహేశ్వరం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మునుపెన్నడూ లేనివిధంగా చారిత్రక ఆలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం ఇన్‌చార్జి కేఎల్లార్ తెలిపారు. తుక్కుగూడ మున్సిపాలిటీలోని జెన్నాయిగూడ శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా రావిరాలకు చెందిన కోటగళ్ల రంజిత్ కుమార్‌తో పాటు డైరెక్టర్లుగా నియమితులైన నారాయణరెడ్డి, సుప్రియ, రవీందర్, దర్శన్‌లతో బుధవారం ఆలయ ప్రాంగణంలో ఆయన ప్రమాణం చేయించారు. చైర్మన్ రంజిత్‌కుమార్ మాట్లాడుతూ చారిత్రాత్మక ఆలయాల అభివృద్ధికి పాలక వర్గంతో కలిసి కృషి చేయనున్నట్లు తెలిపారు. పాలక వర్గం ఎన్నికకు సహకరించిన కేఎల్లార్‌తో పాటునాయకులు,కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు.


ఆలయ కమిటీతో ప్రమాణం చేయిస్తున్న కేఎల్లార్

బీజేపీ కార్యకర్తల జోలికొస్తే ఖబడ్దార్

» ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్ గౌడ్

షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ కార్యకర్తల జోలికొస్తే ఖబడ్దార్ అంటూ బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్ గౌడ్ హెచ్చరించారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని కంసాన్‌పల్లి గ్రామ పంచాయతీ వార్డుకు నామినేషన్ వేసి, రైలు పట్టాలపై అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఆవ శేఖర్ అంతిమ యాత్ర బుధవారం సాయంత్రం గ్రామంలో జరిగింది. ఈమేరకు హాజరైన రాజ్‌భూపాల్‌గౌడ్ విలేకరులతో మాట్లాడారు. వార్డు సభ్యుడిగా గెలుపొంది కాంసాన్‌పల్లిలో బీజేపీని బలోపేతం చేయాలన్న ఆశయంతో ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టిన శేఖర్‌ను తన నామినేషన్ ఉపసంహరించుకోవాలని బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు ఒత్తిడి తెచ్చారని ఆరోపించారు. ఆ గ్రామ నాయకుల వల్లనే శేఖర్ మరణించాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు రాజకీయ ఒత్తిడికి లొంగకుండా నిష్పక్షపాతంగా శేఖర్‌ది ఆత్మహత్యనా? లేక హత్యనో తేల్చాలని డిమాండ్ చేశారు. ఆయన మరణానికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. శేఖర్ మరణానికి కారణమైన వారిని ఈనెల 11 లోపు అరెస్టు చేయకపోతే షాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌తో పాటు డీసీపీ ఆఫీసును ముట్టడిస్తామని రాజ్‌భూపాల్‌గౌడ్ హెచ్చరించారు. బీజేపీ నాయకులు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, వంశీకృష్ణ, హరిభూషణ్‌పటేల్, సుధాకరప్ప, గణేష్, రాము తదితరులున్నారు.

పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

బొంరాస్‌పేట్/తాండూరు రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని మెట్లకుంటలో వరి, కంది పంటలను వరి పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు బుధవారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ.. రైతులు నాణ్యమైన విత్తనాలతో సాగుచేయాలన్నారు. రైతు ఉన్నతికి నాణ్యమైన విత్తనాలే వాడాలని శాస్త్రవేత్తలు ప్రతి నిధులు పేర్కొన్నారు. తాండూరు మండలం బెల్కటూర్‌లో వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు పంటలను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. నాణ్యమైన విత్తనం వాడితే 15 నుంచి 20శాతం పంట దిగుబడి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో తాండూరు ఇన్‌చార్జి ఏడీ కొమురయ్య, ఏఈవోలు శ్రీను, రఘు వంశీ, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థుల విజయమే లక్ష్యం

బొంరాస్‌పేట్, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయమే లక్ష్యమని మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గంగిశెట్టి విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కార్యకర్తలు, నాయకులు పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలే అభ్యర్థుల గెలుపుకు దోహదపడతాయన్నారు.



మాట్లాడుతున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

మద్యం షాప్‌లకు ఎన్నికల కిక్కు

(5వ పేజీ తరువాయి)

డిసెంబరు నెలలో పండగొచ్చింది. పంచాయతీ ఎన్నికల నామినేషన్ల పర్వం ప్రారంభమైనప్పటి నుంచి మద్యం విక్రయాలు ఊపందుకున్నాయి. ఇప్పటికే గ్రామాల్లో మద్యం రోజూ ఏరులై పారుతోం ది. ఓటర్లను ప్రభావితం చేసేందుకు ఎన్నికల బరి లో ఉన్న అభ్యర్థులు, ఆశావహులు ఓటర్లకు రోజూ మద్యం పంపిణీ చేస్తున్నారు. దీంతో ఇటీవల మద్యం కొనుగోళ్లకు డిమాండ్ బాగా పెరిగింది. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు భారీగా మద్యం కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలో మూడు విడతలుగా పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తుండడంతో ఊహించని విధంగా మద్యం విక్రయాలు జరిగే అవకాశం ఉంది. పంచాయతీ ఎన్నికలు తొలి విడత ఈనెల 11న, రెండవ విడత 14న, తుది విడత 17న జరగనున్న విషయం తెలిసిందే. నామినేషన్ల స్వీకరణ పర్వం ప్రారంభమైనప్పటి నుంచి ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు మద్యం విక్రయాలు పెద్ద ఎత్తున జరగనున్నాయి. ప్రధాన రాజకీయ పార్టీల మద్దతుదారులతో పాటు పలువురు స్వతంత్ర అభ్యర్థులూ ఈ ఎన్నికల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నా రు. ఈ నేపథ్యంలో ఓటర్లను ప్రభావితం చేసేందుకు అభ్యర్థులు పోటాపోటీగా ఇంటింటికీ మద్యం, నగదు పంపిణీ చేసేందుకు తెరవెనక సన్నాహాలు చేస్తున్నారు. తమ మద్దతుదారులతో పాటు ఓటర్లకు మద్యం పంపిణీని ఇది వరకే ప్రారంభించారు.

తొలి రోజు అంతంత మాత్రమే


కన్మన్‌కాల్వ క్లస్టర్‌లో కిష్టంపల్లి సర్పంచ్‌గా నామినేషన్ వేస్తున్న అభ్యర్థిని

(5వ పేజీ తరువాయి)

స్థానాలకు 100, వార్డు సభ్యుల స్థానాలకు 200 నామినేషన్లు దాఖలైనట్లు అధికారులు తెలిపారు.

పరిగి మండలంలోని 32 పంచాయతీల పరిధిలో సర్పంచ్ స్థానాలకు 18, 268 వార్డులకు 24 నామినేషన్లు దాఖలు చేశారు. దోమ మండలం 36 సర్పంచ్ స్థానాలకు 24, 308 వార్డులకు 32 నామినేషన్లు, కులకచర్ల మండలంలో 33 సర్పంచులకు 18, 280 వార్డులకు 25 నామినేషన్లు, చౌడాపూర్ మండలంలోని 24 సర్పంచులకు ఆరు, వార్డులకు 10 నామినేషన్లు, పూడూరు మండలంలోని 32 సర్పంచ్ స్థానాలకు 34, 282 వార్డు సభ్యులకు 109 చొప్పున నామినేషన్లు దాఖలు చేశారు. బుధవారం తిథి, నక్షత్రం బాగాలేదని చాలా గ్రామాల్లో అభ్యర్థులు నామినేషన్‌లు వేసేందుకు ముందుకు రాలేదు. గురు, శుక్రవారాల్లో పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యే అవకాశం ఉందని అధికార వర్గాలు భావిస్తున్నాయి. కాగా, పరిగి మండలం రూప్‌ఖాన్‌పేట్, రంగంపల్లి, గడిసింగాపూర్‌లలో డిప్యూటీ కలెక్టర్ వాసుచంద్ర, తహసీల్దార్ వెంకటేశ్వరి, పూడూరు మండలం సోమన్‌గుర్తిలో అదనపు కలెక్టర్ సుధీర్, తదితర ఉన్నతాధికారులు క్లస్టర్లలోని నామినేషన్ల ప్రక్రియను పరిశీలించారు.

మున్నూర్ సోమారం పీఏసీఎస్ డైరెక్టర్ మృతి

ధారూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ధారూరు పీఏసీఎస్ పరిధిలోని మున్నూర్ సోమారం పీఏసీఎస్ డైరెక్టర్ పి.రవీందర్ అనారోగ్యంతో బుధవారం మృతిచెందాడు. పీఏసీఎస్ చైర్మన్ వై.సత్యనారాయణరెడ్డి, బీజేపీ వికారాబాద్ అసెంబ్లీ కో-ఆర్డినేటర్ నందు, రాజకీయ పార్టీల నాయకులు, సొసైటీ సిబ్బంది రవీందర్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

జాతీయ స్థాయి స్మార్ట్ ఇండియా హ్యాకథాన్

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ నారపల్లిలోని నల్ల మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించే జాతీయస్థాయి స్మార్ట్ హ్యాకథాన్‌లో విద్యార్థులు పాలుపంచుకోవాలని కళాశాల డైరెక్టర్ నల్ల దివ్య బుధవారం తెలిపారు. ఈ నెల 8, 9తేదీల్లో హ్యాకథాన్-2025 నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సెంట్రల్ మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్ గైడ్‌లైన్స్ ప్రకారం హ్యాకథాన్ నిర్వహిస్తామని తెలిపారు. ఇందులో వివిధ రాష్ట్రాల కళాశాలల విద్యార్థులు పాల్గొంటారన్నారు. విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ



చౌడాపూర్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని మరికల్‌లో బుధవారం అయ్యప్పస్వామి పడిపూజ ఘనంగా నిర్వహించారు. గురుస్వాములు చెన్నయ్య, రవి, పాండురంగయ్య, పురుషోత్తం, పెంటయ్యల ఆధ్వర్యంలో స్వాములు గ్రామంలో పల్లకిసేవ నిర్వహించారు. పూజల అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

తుది విడత ఎన్నికల నామినేషన్లు

- మొదటి రోజు దాఖలు చేసిన అభ్యర్థులు
- మరో రెండు రోజుల పాటు స్వీకరణ
- క్లస్టర్ కేంద్రాలను సందర్శించిన అధికారులు


పూడూరు: సోమన్‌గుర్తి నామినేషన్ కేంద్రాన్ని సందర్శించిన అడిషనల్ కలెక్టర్ సుధీర్


కులకచర్ల: నామినేషన్ వేస్తున్న వెంకటయ్యగౌడ్


పరిగి మండలం గడిసింగాపూర్ క్లస్టర్ కేంద్రలో సూచనలు ఇస్తున్న ఆర్డీవో వాసుచంద్ర


దోమలో నామినేషన్ వేస్తున్న విజయ్‌కుమార్‌రెడ్డి


తిరుమలాపూర్ నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించిన ఎంపీడీవో రామకృష్ణ

సర్పంచ్ పదవులకు పలువురి ఏకగ్రీవం

తాండూరు రూరల్/తాండూరు/బషీరాబాద్/యాలాల/బొంరాస్‌పేట్/బషీరాబాద్/కొడంగల్ రూరల్/ధారూరు/డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): తాండూరు మండలంలో కరన్‌కోట్, బిజ్వార్, పర్వతాపూర్ సర్పంచ్ పదవులు ఏకగ్రీవమయ్యాయి. బుధవారం నామినేషన్ల ఉపసంహరణ చివరి రోజు విత్‌డ్రాలతో కొన్ని పంచాయతీలు ఏకగ్రీవమైనట్లు ఎన్నికల క్లస్టర్ అధికారులు తెలిపారు. కరన్‌కోట్ పంచాయతీకి రాజ్‌కుమార్, బిజ్వార్‌కు అనుసూజ, పర్వతాపూర్‌నకు వెంకటమ్మ ఎన్నికైనట్లు తెలిపారు. అలాగే కరన్‌కోట్‌లో 14 వార్డులు, బిజ్వార్‌లో 8 వార్డులు, పర్వతాపూర్‌లో 5 వార్డులు ఏకగ్రీవమైనట్లు అధికారులు పేర్కొన్నారు. కరన్‌కోట్, చైతన్యనగర్, రుద్రారం, బాద్లాపూర్ సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవం కావడంతో తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి వారికి శుభాకాంక్షలు తెలిపారు. సర్పంచ్, వార్డుసభ్యులను సన్మానించారు. ఎన్నికలు జరిగే స్థానాల్లోనూ మెజార్టీ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులే గెలుస్తారని పేర్కొన్నారు. బషీరాబాద్ మండలం బద్లాపూర్ సర్పంచ్ పదవి ఏకగ్రీవమైంది. ఎస్సీ మహిళకు రిజర్వైంది. నవనీత, నర్సమ్మ, పి.నర్సమ్మ నామినేషన్లు వేశారు. మిగతా ఇద్దరి విత్‌డ్రాతో నవనీత, సర్పంచ్‌గా ఎంపికయ్యారని ఎంపీడీవో సంపత్‌కుమార్ తెలిపారు. యాలాల మండలంలో 39 పంచాయతీలు ఉన్నాయి. విత్ డ్రాలు ముగిసిన తరువాత 9 పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. లక్ష్మీనారాయణపూర్, సంగెంఖుర్దు, కిష్టాపూర్, జక్కెపల్లి, పేర్కంపల్లి తండా, గంగసాగర్, సంగాయిగుట్ట తండా, బండమీదిపల్లి, దేవుళ్లతండా ఏకగ్రీవం అయ్యాయి. బొంరాస్‌పేట్ మండలంలో 7 పంచాయతీలు ఏకగ్రీవమైనట్లు అధికారులు ప్రకటించారు. సాలిండపూర్‌లో రిక్కిబాయి, మదన్‌పల్లి తండాలో శంకర్‌నాయక్, జానకంపల్లిలో వెంకటయ్య, నాగిరెడ్డిపల్లిలో అనిత, కట్టుకాల్వ తండాలో కిషన్‌నాయక్‌లు సర్పంచ్‌లుగా ఎన్నికయ్యారు. పాలబాయి తండా కూడా ఏకగ్రీవమైనట్లు అధికారి వెంకన్నగౌడ్ ప్రకటించారు. బషీరాబాద్ మండలం నంద్యానాయక్‌తండా పంచాయతీ సర్పంచ్ పదవి ఏకగ్రీవమైంది. ఈ పదవికి ఐదుగురు నామినేషన్లు వేయగా నలుగురు విత్‌డ్రా చేసుకోగా సుమ్మీబాయి ఏకగ్రీవమైనట్లు అధికారులు ప్రకటించారు. కొడంగల్ మండలంలోని టేకుల్‌కోడ్ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యులు ఎకగ్రీవమయ్యారు. టేకుల్‌కోడ్ సర్పంచ్‌గా చింతకింది రాజు ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు. ధారూరు 12వ వార్డుకు సరిగా లేని నామినేషన్‌ను అధికారులు తిరస్కరించడంతో ఏకగ్రీవమయింది. రాథోడ్ రమేశ్ వార్డు సభ్యునిగా ఎన్నిక కానున్నారు. మండలంలోని 34 పంచాయతీల్లో 42 వార్డు స్థానాలు ఏకగ్రీవం అయినట్టు సమాచారం.


తాండూరు : ఏకగ్రీవంగా ఎంపికైన సర్పంచ్, వార్డు సభ్యులకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే

నామినేషన్ పత్రాలను జాగ్రత్తగా భద్రపరచాలి

పెద్దేముల్/యాలాల/తాండూరు రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): నామినేషన్ పత్రాలను జాగ్రత్తగా భద్రపర్చాలని వికారాబాద్ జిల్లా ఎన్నికల పరిశీలకులు యాస్మిన్‌బాషా అన్నారు. పెద్దేముల్ మండలం మన్‌సాన్‌పల్లి క్లస్టర్‌ను జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్‌చౌదరిలతో కలిసి పరిశీలించారు. నామినేషన్ల ప్రక్రియ ఎలా జరిగిందని తెలుసుకున్నారు. ఎన్నికలు సమర్థంగా నిర్వహించేందుకు శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలని యాస్మిన్ సూచించారు. యాలాల మండలం కమాల్‌పూర్ క్లస్టర్‌లో నామినేషన్ల ప్రక్రియను పరిశీలించారు. నామినేషన్ల ప్రకియలో తప్పులు, పొరపాట్లు లేకుండా చూడాలని ఆదేశించారు. పరిశీలనలో ఎంపీడీవో శ్రీనిజ, రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు. తాండూరు మండలం గౌతాపూర్, బెల్కటూర్ క్లస్టర్లను కలెక్టర్, సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్‌తో కలిసి యాస్మిన్‌బాషా పరిశీలించారు. రిటర్నింగ్ అధికారుల పనితీరు ఎలా ఉంది అని అడిగి తెలుసుకున్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ హర్ష చౌదరి, తాండూరు ఎంపీడీఓ విశ్వ ప్రసాద్, తహసీల్దార్ తారాసింగ్ పాల్గొన్నారు.


తాండూరు మండలం బెల్కటూర్ క్లస్టర్‌లో నామినేషన్ల ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎన్నికల పరిశీలకురాలు యాస్మిన్ బాషా

ఘనంగా ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం


నవాబుపేట: కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈవో అబ్దుల్‌రహెమాన్

దోమ/పరిగి/బొంరాస్‌పేట్/మోమిన్‌పేట్/నవాబుపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దోమలోని భవిత కేంద్రంలో బుధవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దివ్యాంగ చిన్నారులకు వివిధ ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. విద్యకు అంగవైకల్యం అడ్డుకాదని, శ్రద్ధగా చదువుకోవాలని సూచించారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లల తల్లిదండ్రులకు అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గ్యామానాయక్, ఎంఈవో వెంకట్, హెచ్‌ఎం రాములు, స్వాతి, ఉపాధ్యాయులు రాధిక, గోపాల్, సాయికుమార్, శ్రీను, అంజిలయ్య, వెంకట్‌దాస్, గోవర్ధన్ పాల్గొన్నారు. పరిగిలోని భవిత కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో హరిప్రియ ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఆటపోటీలు నిర్వహించి బహుమతులందజేశారు. భవిత కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంఈవో గోపాల్, టీచర్లు మహేందర్, జ్యోతి పాల్గొన్నారు. బొంరాస్‌పేట్‌లోని జెడ్పీ పాఠశాలలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఎంఈవో హరిలాల్ మాట్లాడుతూ.. చదువుకు అంగవైకల్యం అడ్డు కాదని, విద్యార్థులు శ్రద్ధతో చదువుతూ ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫిజియోథెరపిస్ట్ నవనీత, హెచ్‌ఎంలు లక్ష్మి, అనసూయ, సీఆర్‌పీలు, ఉపాధ్యాయులు గంగాధర్, ఐఆర్పీ వేణుగోపాల్ పాల్గొన్నారు. మోమిన్‌పేట్‌లో చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఎంపీడీవో సృజన సాహిత్య మాట్లాడుతూ.. ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంఈవో మల్లేశం, హెచ్‌ఎం ఎస్తేర్, టీచర్లు రమేశ్, షోయబ్, ఐఈఆర్‌పీ మోహన్ పాల్గొన్నారు. నవాబుపేటలో ఎంఈవో అబ్దుల్ రహెమాన్ మాట్లాడుతూ దివ్యాంగులను చులకనగా చూడొద్దన్నారు. ఆటల పోటీలు నిర్వహించారు. హెచ్‌ఎం మల్లేశం, కవిత, వీరమణి తదిరులు పాల్గొన్నారు.


దోమ: పిల్లలకు బహుమతులిస్తున్న ఎంఈవో వెంకట్


పరిగి: మాట్లాడుతున్న ఎంపీడీవో హరిప్రియ

హైస్కూల్‌లో స్వయం పాలన దినోత్సవం

ధారూరు, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): ధారూరు బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. పాఠశాలలోని విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తరగతి గదుల్లో తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయుల పాత్రల్లో విద్యార్థులే విధులు నిర్వహించి విద్యార్థులకు పాఠాలు బోధించి పాఠశాలను నడిపించారు. కొందరు విద్యార్థులు ప్రతిభ చూపారని ఉపాధ్యాయులు అన్నారు. వారిని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.


ధారూరు పాఠశాలలో స్వయం పాలన దినోత్సవంలో విద్యార్థులు

విద్యార్థినులకు దాతల చేయూత

దోమ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దోమలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో దాతలు ఆర్యన్ రాజ్‌పుత్, దీపన్ భూపతి, సంఘ సేవకురాలు అనిత, నిఖిత సహకారంతో రూ.80వేల విలువ గల క్రీడా సామగ్రిని బుధవారం అందించారు. క్రీడలు మానసిక, శారీరక ధారుఢ్యానికి ఎంతో దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గ్యామానాయక్, డీటీ నర్సిములు, ఎంఈవో వెంకట్, ఎస్సై వసంత్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు రాములు, కేజీబీవీ పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థినులకు క్రీడా సామగ్రిని అందజేస్తున్న దాతలు

అంబులెన్స్‌లో గర్భిణి ప్రసవం

ధారూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పురిటి నొప్పులతో వికారాబాద్ ప్రభుత్వ అసుపత్రికి అంబులెన్స్‌లో తరలిస్తున్న గర్భిణి మార్గమధ్యలో అంబులెన్స్‌లో ప్రసవించింది. మగ శిశువుకు జన్మనిచ్చింది. వివరాలిలా ఉన్నాయి. రుద్రారం గ్రామానికి చెందిన ప్రవీణకు బుధవారం పురిటి నొప్పులు రాగా కుటుంబసభ్యులు 108 అంబులెన్సు వాహనానికి సమాచారమిచ్చారు. ధారూరు నుంచి రుద్రారం వెళ్లిన అంబులెన్సు ప్రవీణను వికారాబాద్ ప్రభుత్వ ప్రసూతి అసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో అనంతగిరి గుట్ట వద్ద ప్రసవించింది. ఈఎంటీ ప్రకాష్, పైలట్ శ్రీకాంత్‌లు వారిని తల్లీబిడ్డను వికారాబాద్‌లోని ప్రభుత్వ ప్రసూతి అసుపత్రిలో చేర్పించారు.


అంబులెన్సులో ప్రసవించిన ప్రవీణ

లబ్ధిదారుకు బీమా చెక్కు అందజేత



ఇన్సూరెన్స్ చెక్కును అందజేస్తున్న ఎస్‌బీఐ మేనేజర్ గౌరవ్‌సిన్హా

ధారూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ధారూరు ఎస్‌బీఐ ఖాతాదారు తెలుగు మల్లమ్మ మృతితో ఆయన భర్త రాములుకు బీమా చెక్కును ధారూరు ఎస్‌బీఐ మేనేజర్ గౌరమ్‌సిన్హా బుధవారం అందజేశారు. మల్లమ్మ బ్యాంకులో ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజనలో చేరి సవంత్సరానికి రూ.436 చెల్లించింది. ఆమె మృతిచెందటంతో నామినీ అయిన భర్త రాములుకు వచ్చిన రూ.2లక్షల బీమా చెక్కును బ్యాంకు మేనేజర్ గౌరవ్‌సిన్హా అందజేశారు. ఆయన మాట్లాడుతూ బ్యాంకు ఖాతాదారులు పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై వంటి బీమా పథకాలను చేయించుకుంటే కుటుంబాలకు భరోసాగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఎఫ్‌ఎల్ కౌన్సిలర్లు రాజేష్, రాజు, సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బడి బయటి పిల్లల సర్వే


కులకచర్ల మండలం మంచికుంటలో సర్వే నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

కులకచర్ల, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాలు, తండాల్లో బడి బయట ఉన్న పిల్లల సర్వే నిర్వహించారు. బుధవారం మంచికుంట తండాలో ఉపాధ్యాయులు ఇంటింటి సర్వే నిర్వహించారు. ముజాహిద్‌పూర్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థి 40రోజులుగా బడి బయట ఉన్నట్లు గుర్తించారు. విద్యార్థి తల్లిదండ్రులతో మాట్లాడారు. బాలుడిని పాఠశాలకు పంపించాలని టీచర్లు సూచించారు. ఈ కార్యక్రమంలో మంచి కుంట తండా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రహీమ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కరన్‌కోట్ ఏకగ్రీవ సర్పంచ్‌కు అభినందనల వెల్లువ


మైలారం రాజ్ కుమార్‌ను అభినందిస్తున్న గ్రామస్తులు

తాండూరు రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండల పరిధి కరన్‌కోట్ మేజర్ పంచాయతీకి సర్పంచ్‌గా రాజ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం ఆయనకు గ్రామస్తులు పంచాయతీ వద్ద అభినందనలు తెలిపారు. జిల్లాలోనే కరన్‌కోట్ పంచాయతీ అతి పెద్దది. గ్రామ జనాభా 11వేలు. 7,500 మంది ఓటర్లు, 14 వార్డులు ఉన్నాయి. వార్డులు సైతం రెండు రోజుల క్రితం ఏకగ్రీవం అయ్యాయి. ఒక అభ్యర్థి నామినేషన్ ఉపసంహరించుకోవడంతో రాజ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు పేర్కొన్నారు. రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. తన ఏకగ్రీవానికి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కృషి మరువలేనిదని అన్నారు. ఎమ్మెల్యే సహకారంతో సదుపాయల కల్పనకు కృషిచేస్తామని అన్నారు. తనకు సహకరించిన కాంగ్రెస్ నాయకులు మాజీ ఎంపీపీ శరణుబసప్ప, నియోజకవర్గ నాయకులు తుపాకుల అనిల్, సుధాకర్, జర్నప్ప, కిషన్‌రావు, తుపాకుల బసప్ప, వార్డుసభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి రాజ్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

ఏకగ్రీవమైన వారికి సన్మానాలు, శుభాకాంక్షలు



దోమ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణపల్లి, పెద్దతండా సర్పంచ్, ఉపసర్పంచ్, ఎనమిది మంది వార్డు సభ్యులు ఏకగ్రీవమయ్యారు. సర్పంచ్‌గా నేనావత్ సురేఖ, ఉపసర్పంచ్‌గా రమేశ్, వార్డు సభ్యులను ఏగ్రీవంగా ఎన్నుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. వారిని పూలమాలలతో సన్మానించారు.

నేడు కాగ్నాలో గంగా హారతి

తాండూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ అర్చక, పురోహితుల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 4న పౌర్ణమి సందర్భంగా మండలంలోని కోకట్ గ్రామ సమీపంలో కాగ్నా వంతెన వద్ద కాగ్నా గంగా హారతి నిర్వహిస్తున్నారు. బుధవారం సాయంత్రం 5:31గంటలకు గంగా హారతిలో పాల్గొన్నాలని కోరారు.

క్రైం కార్నర్

రెండు బైక్‌లు ఢీ.. యువకుడి దుర్మరణం

- దంపతులకు తీవ్ర గాయాలు


మృతిచెందిన చెన్నయ్య

కొడంగల్ రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రెండు బైకులు ఢీకొని ఓ యువకుడు మృతిచెందగా దంపతులకు తీవ్రగాయాలైన సంఘటన బుధవారం కొంగల్ పరిధి 163 జాతీయ రహదారి బూల్కాపూర్ గేటు సమీపంలో చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల మేరకు.. దౌల్తాబాద్ మండలం నర్సాపూర్‌నకు చెందిన భార్యాభర్తలు కుర్వ దస్తప్ప, రాములమ్మ ద్విచక్ర వాహనంపై కొడంగల్ వస్తున్నారు. బూల్కాపూర్ గేటు సమీపంలో కోస్గికి చెందిన మణికొండ చెన్నకేశవులు(చెన్నయ్య) కొడంగల్ వైపు నుంచి రావులపల్లి వైపు వెళ్తున్న క్రమంలో వాహనాన్ని ఓవర్ టేక్ చేయబోయి దంపతుల ఢీకొన్నాడు. చెన్నయ్య(26) అక్కడి కక్కడే మృతిచెందగా రాములమ్మ, దస్తప్పలకు తీవ్రగాయాలై పడిపోయారు. వాహనదారులు 108కు సమాచారం ఇవ్వగా ప్రభుత్వ అసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం హైదరాబాద్‌కు రెఫర్ చేశారు. కాగా మృతుడు చెన్నయ్యకు ఆరు నెలల కిందటే వివాహమైనట్టు సమాచారం.